విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల
ఆదివారం 16 ఫిబ్రవరి 2025 8 పేజీలు

ఇంకుడుగుంతల నిర్మాణానికి
ఆర్థిక సాయం

- పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి
- ఇంకుడుగుంతల నిర్మాణానికి ప్రభుత్వ సాయం
- ఇంకుడు గుంతలతో భూగర్భ నీటి మట్టం పెరుగును
- సుమారు15 వేల ఇంకుడు గుంతలను నిర్మించాలి
- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-కొండపి : 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' మహోన్నత కార్యక్రమమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం కొండపి మండలంలోని జార్లపాలెం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా స్థానికులు, విద్యార్థులతో కలిసి నిర్వహించిన అవగాహన ర్యాలీలో వారు పాల్గొన్నారు. అనంతరం ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కూడా ప్రజలందరూ ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రజల్లో అవగాహన పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఇంకుడుగుంతల నిర్మాణానికి కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో వివిధ అవసరాలకు వినియోగించిన నీటిని డ్రైనేజీలలోకి, రోడ్లపైకి వదలకుండా ఇంకుడు గుంతలు తవ్వుకొని వాటిలోకి మళ్ళిస్తే భూగర్భ నీటిమట్టం పెరుగుతుందని మంత్రి చెప్పారు. తద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతోపాటు రోగాలను నివారించ వచ్చని అన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఇంకుడు గుంతలను నిర్మించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ క్రమంలో మన జిల్లాలో కూడా

మిగతా 2 లో ...

దొనకొండలో పారిశ్రామిక కారిడార్

- నిమ్జ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి
- నిరుద్యోగ భృతి నెలకు రూ.3000లు వెంటనే ఇవ్వాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర-పామూరు : దొనకొండలో పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్ లో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువత కు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతుల ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గుజ్జుల ఎలమంద రెడ్డి భవన్ లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలలో దాదాపుగా 31 తీర్మానాలను ఆమోదించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో యువకులకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా ను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి బడ్జెట్లో ప్రత్యేక నిధులను కేటాయించాలన్నారు. దేశంలో రాష్ట్రంలో వేలాదిమంది ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక రోడ్లు వెంబడి తిరుగుతున్నారని ఆయన అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ

మిగతా 2 లో ...

ప్రతి మూడో శనివారం
'స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివాస్'

బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : రేపటి తరం కోసం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ప్రజలకు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక బాపట్ల పట్టణంలో 32వ వార్డు చంగల్ రాయుడు తోటలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్య మంత్రి పట్టణాల్లో, పల్లెల్లో,ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేటు సంస్థలలో, రైల్వే స్టేషన్‌ల్లో,ఆర్టీసీ బస్టాండ్‌లో శుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండే విధంగా ప్రతిరోజు పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారన్నారు.

మిగతా 2 లో ...

చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి 'పల్లెనిద్ర'

అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

విశాలాంధ్ర - బాపట్ల : చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకే పల్లెనిద్ర కార్యక్రమమని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తెలిపారు.బాపట్ల పట్టణంలోని మున్నావారిపాలెంలో పల్లెనిద్ర కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పాల్గొన్నారు.ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి అవగాహన కల్పించి ఆ ప్రాంతంలో నివాసముండే చెడు నడత కలిగిన వ్యక్తులు యొక్క సమాచారాన్ని ప్రజల నుండి సేకరించారు.అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ప్రజల యొక్క సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి,రోడ్డు భద్రతా నియమాల గురించి,హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు స్థానికంగా జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.స్థానికంగా ఉన్న సమస్యలను దృష్టికి తీసుకొని వస్తే వాటిని చట్ట పరిధిలో పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్న వారి గురించిన సమాచారం తెలపాలని సూచించారు. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు పోలీస్ శాఖకు అందించాలని కోరారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.సైబర్ నేరాలు జరుగుతున్న తీరును గురించి

మిగతా 2 లో ...

యర్రగొండపాలెంలో
స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలోని పలు వీధులలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. పంచాయతీ కార్మికులతో పాటు తాము కూడా తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచాయతీ కార్యాలయ పారిశుధ్య కార్మికులకు ఎరిక్షన్ బాబు శాలువాలు, పూల దండలతో సన్మానం చేసి వారి సేవలను కొనియాడారు. అనంతరం పట్టణంలో స్వచ్చత ర్యాలీ నిర్వహించారు. మండల ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతల నిర్మాణానికి ఆర్థిక సాయం

మొదటి పేజీ తరువాయి

సుమారు15 వేల ఇంకుడు గుంతలను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. జార్లపాలెం గ్రామంలో 150 ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామం స్వచ్ఛంగా ఉండటం ద్వారా మొత్తం ప్రకాశం జిల్లా కూడా స్వచ్ఛంగా ఉంటుందన్నారు. ఈ దిశగా ప్రజలందరూ తమ వంతు బాధ్యతను నిర్వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతినెలలో మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెలలో ఇంకుడు గుంతలు త్రవ్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి తెలిపారు. అలాగే అర్బన్ ప్రాంతాలలో కూడా చెత్తను సేకరించి చెత్తనుండి సంపద సృష్టించడం, చెత్త నుంచి విద్యుత్ తయారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంకుడుగుంతల ఆవశ్యకతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. వీటి నిర్మాణం ద్వారా జార్లపాలెం గ్రామం జిల్లాకే స్ఫూర్తిగా నిలవాలని ఆమె అభిలాషించారు. తడి చెత్తను, పొడి చెత్తను ఇంటి వద్ద ప్రజలు వేరు చేసేలా అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశుభ్రత ద్వారానే ఆరోగ్యకర సమాజము ఆవిష్కృతమవుతుందన్నారు. పిల్లలు ఆరోగ్యముగా ఎదిగే అవకాశం కల్పించాలని, వారికి బాల్యవివాహాలు చేయకుండా కనీసం ప్రతి ఆడబిడ్డ డిగ్రీ చదివేలా చూడాలని ప్రజలకు ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత పనుల్లో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మంత్రి, కలెక్టర్ స్వయంగా పాల్గొని స్థానికుల్లో స్ఫూర్తిని నింపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి వనరులను పొదుపుగా వాడుకోవటం, భూగర్భ నీటిమట్టం పెరిగేందుకు తీసుకోవలసిన చర్యలు, ఇంకుడు గుంతల నిర్మాణ ఆవశ్యకతను తెలియజేసేలా ఈ కార్యక్రమంలో నిర్వహించిన నాటక ప్రదర్శన స్థానికులను ఆకట్టుకుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో తమ వంతు బాధ్యత నిర్వహిస్తామని స్థానికులతో ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. రెండు డ్వాక్రా సంఘాలకు మూడు లక్షల రూపాయల చొప్పున మంజూరైన రుణాలను ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంత్రి , కలెక్టర్ అందించారు. కార్యక్రమంలోఆర్డీఓ కె.లక్ష్మీ ప్రసన్న, డి.పి.ఓ..జి.వెంకట నాయుడు, డ్వామా పీ.డీ.జోసఫ్ కుమార్, జడ్పీ సి.ఈ.ఓ. బి.చిరంజీవి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ.అర్జున్ నాయక్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్.ఈ. శ్రీ.బాల శంకర్ రావు, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ, స్థానిక మండల అభివృద్ధి అధికారి రామాంజనేయులు, తహసిల్దార్ మురళి, ఇతర అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దొనకొండలో పారిశ్రామిక కారిడార్

ప్రకారం చదువుకుని ఖాళీగా ఉన్న యువకులకు వెంటనే నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యా, వైద్యం ఉపాధి అవకాశాలు కల్పించాలని రాజ్యాంగంలో ఉన్న నిబంధనలను పాలక ప్రభుత్వాలు పట్టించు కోకపోవడంతో యువత పెడద్రోవ పట్టుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభల్లో చేసిన తీర్మానాల అమలు కోసం భవిష్యత్తులో పోరాటాలకుసిద్ధమవుతున్నట్లు ఆయన అన్నారు. పోరాటాల్లో యువతీ యువకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మహేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి 'పల్లెనిద్ర'

ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. ఇటీవల జరిగిన అనేక రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారే ఎక్కువ శాతం మృత్యువాత పడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం వారు హెల్మెట్ ధరించకపోవడమేనన్నారు. హెల్మెట్ ధరిస్తే తల మెడ భాగాలకు రక్షణ కల్పిస్తుందన్నారు.తద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని తెలియజేశారు.కార్యక్రమంలో బాపట్ల పట్టణ సీఐ రాంబాబు, ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్లలో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రమైన కొనకనమిట్లలో పంచాయతీ కార్యదర్శి మేడవరం శ్రీనివాసరావు సర్పంచి లక్ష్మీ తిరుపతమ్మల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని వీధులను, కాలువలను శుభ్రం చేయించారు. గ్రీన్అంబాసిడర్లు ఇండ్ల వద్ద నుంచి చెత్తను సేకరించారు. వ్యక్తిగత శుభ్రత పరిసరాల పరిశుభ్రత పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

దోస్తీ ఫౌండేషన్ కార్యక్రమాలు అభినందనీయం

విశాలాంధ్ర-ఒంగోలు : దోస్తీ ఫౌండషన్ కార్యక్రమాలు అభినందనీయమని విభిన్న ప్రతిభావంతులశాఖ అధికారి అర్చన అన్నారు. ఒంగోలు సంతపేటలోని దివ్యాంగుల హాస్టల్లో ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో వికలాంగులకు బియ్యం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏడి అర్చన ముఖ్యఅతిథిగా హాజరై వికలాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ అయిన దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ మహబూబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నారని అనేక వాటిలో తాను కూడా పాల్గొనడం జరిగిందని అన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహించబట్టే చాలామంది దివ్యాంగులకు న్యాయం చేయగలుగుతున్నామని అన్నారు. దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంతో మంది దివ్యాంగుల విద్యార్థులకు పుస్తకాలు, ట్రై సైకిళ్ళ, నిత్యావసర సరుకులు, అన్నదాన కార్యక్రమాలు వంటివి ఎన్నో చేస్తున్నారని వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ దోస్తీ ఫౌండేషన్ ద్వారా ఒంగోలు నగరంలో పలు వృద్ధాశ్రమాలు అనాధాశ్రమాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న షేక్ మహబూబ్‌కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నత్తల శ్రీనివాసరావు దివ్యాంగుల హాస్టల్ నిర్వాహకులు శివ కృష్ణారెడ్డి రమణయ్య నరాల కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు నిర్మాణానికి శ్రీకారం

విశాలాంధ్ర-కొండపి : చెత్త పై పన్ను విధించిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు చెత్తలో కలిపేశారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. కొండపి మండలము జాళ్లపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శనివారం పాల్గొన్న మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడారు. మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా స్వయంగా చీపురు పట్టి పరిసరాలు శుభ్రం చేశారు. జిల్లాలో 15 వేల ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంద అన్నారు. చెత్త పై పన్ను వేసిన వైసిపి ని ప్రజలు చెత్తలో కలిపారు అని విమర్శించారు. ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెంపు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి కోరారు. విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రత తదితర అంశాల మీద ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు టిడిపి పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

యానాది కులస్తులపై దాడిని ఖండన

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలం బక్కిరెడ్డిపాలెం దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. చీమకుర్తి మండలంలో బక్కిరెడ్డి పాలెం యానాది కాలనీకి చెందిన కొమరగిరి వెంకటేశ్వరమ్మ,చలమచర్ల దుర్గ, చెవూరి సుబ్బాయమ్మ యానాది మహిళలు అదే గ్రామానికి చెందిన రెడ్డి కులస్తులు ఇస్మాయిడి సుబ్బులు మరియు ముగ్గురు కలిసి 14వ తేదీ సాయంత్రం కారంపొడి పైట కొంగులో పోసుకుని కర్రలు తీసుకుని యానాది కాలనీలో ఉన్నటువంటి యానాదుల కుటుంబా లపై దాడి చేసి,కారంచల్లి, దుర్భాషలాడి కొట్టారని, ఊరు వదిలి వెళ్లాలని లేదంటే చంపు తామని బెదిరించారని,ప్రజా సంఘాల నిజ నిర్ధా రణ కమిటీగా ఏర్పడి చీమకుర్తి ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించడం జరిగింది.యానాదులపై తప్పుడు కేసులు నమోదు చేశారని, వెంటనే యానాదుల పై నమోదు చేసిన తప్పుడు కేసును వెంటనే విత్ డ్రా చేసుకోవాలని, బక్కి రెడ్డి పాలెం యానాదులు కాలనీ వారికి పోలీసులు రక్షణ కల్పించాలని ప్రజాసంఘాలు శనివారం డిమాండ్ చేశాయి.

పెద్ద వెంకన్నపాలెంను ఎంపీడీవో సందర్శన

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని పెద్ద వెంకన్నపాలెం ను శనివారం ఎంపీడీవో డాక్టర్ సుజాత సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత మాట్లాడుతూ మండలంలోని పెద్ద వెంకన్నపాలెం గ్రామపంచాయతీ కింద ఎంపిక కాబడినది కేవలం ఎస్సీ సామజ వర్గానికి సంబంధించిన ఈ పథకం సామాజికంగా ఆర్థికంగా మంచి జీవన ప్రమాణాలతో ఎస్సీ కాలనీల ప్రజలు ఉండాలని పెట్టారు. డొమైన్స్ లో పొందుపరిచిన 50 ఇండికేటర్లు, 10 డొమైన్స్ కి సంబంధించిన కాంపొనెంట్స్, త్రాగునీరు, పారిశుద్ధ్యం, ఎలక్ట్రిసిటీ, అంతర్గత రోడ్లు, సోషల్ సెక్యూరిటీ సంబంధించిన వివరించి ప్రస్తుతం మన ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంలో అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను సమన్వయం చేసుకుంటూ సర్వే కన్వర్జేషన్ పనులు తెలియజేశారు. ఈఓఆర్డి నాగేశ్వర రావు, ఏపీవో మాచర్ల, ఏపిఎం శ్రీనివాసులు, తుమాటి చిన్నప నాయుడు, చల్లా శ్రీనివాసులు, కోయా రాంబాబు ఫీల్డ్ అసిస్టెంట్ చల్లా సురేష్, పంచాయతీ కార్యదర్శి రవి, అంగన్వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రతి మూడో శనివారం

'స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివాస్'

మొదటి పేజీ తరువాయి

ప్రతిరోజు గృహాలలో,పరిశ్రమల్లో,హాస్పటల్లో వచ్చే వ్యర్థ పదార్థాలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. మున్సిపాలిటీల్లో,పల్లెల్లో ప్రజలు వ్యర్థ పదార్థాలను సేకరించడానికి మూడు రకాల డస్ట్ బిన్లను గృహాలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ప్లాస్టిక్ వస్తువులు వాడకం మానవజాతికి మనం మనుగడకు పెను ప్రమాదంగా ఉందన్నారు.ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని ఆయన సూచించారు.32 వార్డు చంగల్ రాయుడు తోటలో చెత్త నుండి సేకరించిన ఎరువు ద్వారా పూల మొక్కలు,పండ్లతోటలను సాగుచేస్తున్న పుష్ప అనే మహిళ గృహాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.పుష్ప అనే మహిళను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్,బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా,బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి,బాపట్ల తహసీల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి

విశాలాంధ్ర – కంభం : బంజారాల, సుగాలీల ఆరాధ్య దైవం సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని కంభం పట్టణంలోని స్థానిక అంజన్ సాయి దంత వైద్యశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ ఎం దశరథ్, అర్ధవీడు ఎంఈఓ లక్ష్మీ నాయక్ మాట్లాడుతూ బంజారాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు అవిరళ కృషిచేసిన ఆధ్యాత్మికవేత్త సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ అని, బంజారాలు ఆయన చూపిన మార్గంలో నడవాలని అన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు కాంతారావు నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవుదినముగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాము, అంజి, కాంతారావు, దేవా, సాధు, చందు, రామకృష్ణ,భీమా, రవీంద్ర, లక్ష్మా తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌లో భాగంగా మూడో శనివారం మండలంలోని పలు గ్రామాలలో దోర్నాల, అయిన ముక్కల, చిన్న దోర్నాల ఎడవల్లి చింతలగ్రహారం గ్రామాల్లో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేసి అనంతరం నినాదాలు చేస్తూ ప్రజలు తమ వీధులను పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి అంటూ వీధులలో తిరిగారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలలో ఇంకుడు గుంతల గురించి వివరించారు. మండల ఎంపీడీఓ నాసర్ రెడ్డి, ఉపాధి హామీ ఏపీవో చాణక్య, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ యేర్వ మల్లికార్జున రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు చంటి, రామ్ రెడ్డి, చెన్నారెడ్డి,తదితర నాయకులు, పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఆర్ జనార్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద మరియు అన్ని గ్రామాల సచివాలయాల వద్ద శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించినట్లయితే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించినట్లయితే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని తాటిచెర్ల గ్రామంలో మలిశె పాపనాయుడు కుమారుడు తిరుమల మరియు ప్రవీణల వివాహ కార్యక్రమంలో శనివారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక మండల టీడీపీ నాయకులు డాక్టర్ బోనేనివెంకటేశ్వర్లు, దద్దవాడ మాజీ సర్పంచ్ బిజ్జం వెంకట్రామిరెడ్డి నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి బీసీ జిల్లా అధికార ప్రతినిధి అనప శేఖర్ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

ఇంటింటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. శనివారం మండలంలోని మరపుగుంట్ల నందు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీలో భాగంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో మరపగుంట్ల గ్రామంలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేయడం జరిగింది. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ము త్తిరెడ్డి వెంకటరెడ్డి, కనిగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, ఒంగోలు శీను, ముత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాస్ నాయక్, ఉపాధి హామీ సిబ్బంది, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ అన్నపురెడ్డి కృష్ణయ్య మరుప గుంట్ల ఫీల్డ్ అసిస్టెంట్ కేలం బాలిరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని పద్మాపురం గ్రామంలో ఏనుగు ప్రతాప్ రెడ్డి (35) అనే వ్యక్తి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెలిగండ్ల ఎస్సై మధు సూదన్‌రావు పామూరు సిఐ భీమా నాయక్‌కు సమాచారం అందించగా హుటాహుటిన సంఘట న స్థలానికి చేరుకొని ఉరి వేసుకున్న విధానాన్ని పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు. వివరాల్లోనికి వెళితే ఇతను నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందినవారుగా ఎన్‌హెచ్ ఫైవ్ నందు సూపర్వైజర్‌గా పనిచేస్తున్నారని వారికి ఫాతిమా భార్య పిల్లలు ఉన్నారని 14వ తేదీ శుక్రవారం రాత్రి వేళ ఇరువురి మధ్య వాదోపవాదన జరిగినట్లు 15వ తేదీ తెల్ల వారు జామున ఉరివేసుకొని మృతి చెందినట్లు పామూరు సిఐ బీమా నాయక్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర - బేస్తవారిపేట : హెూప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పీవీపురం గ్రామంలోని నిర్మలాబాయి బాలకీర్తి నిలయంలో సంస్థ ద్వారా నియమించబడిన కొమరోలు, బేస్తవారిపేట మండలాలకు చెందిన 38 మంది ఫెసిలిటేటర్లకు శనివారం ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కో - ఆర్డినేటర్లు ఎం. విజయ, మరియదాసు, శేఖర్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలి

కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా పద్ధతులు పాటించాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం ఒంగోలులోని రవాణాశాఖ జిల్లా కార్యాలయంలో జరిగిన "జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల" ముగింపు సభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎక్కువ మంది నిర్లక్ష్యం, ఓవర్ కాన్ఫిడెన్స్ కారణంగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం జరుగుతుందని, ఇందులో చర్చించిన అంశాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. శాఖాపరమైన నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ఎక్కడా రోడ్డు ప్రమాదాలు జరగకూడదన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ప్రజల్లో మార్పు రావాలన్నారు. ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాత మాట్లాడుతూ ప్రాణం ఎంతో విలువైనదని, ఆ ప్రాణం కూడా మన చేతుల్లోనే ఉందన్నారు. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. త్వరగా వెళ్ళాలనే ఆలోచనలో ప్రయాణికులు, ఆదాయం చూసుకునే ఆటో డ్రైవర్లు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఉప రవాణ కమిషనర్ సుశీల, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే శాఖల అధికారులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జిల్లా కలెక్టర్, మేయర్ బహుమతులు అందజేశారు.

దళిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతి

విశాలాంధ్ర-కొండపి : మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన దళిత కుటుంబానికి అగ్రకుల కుటుంబం నుండి ఎదురైన ఇబ్బందులు నుండి న్యాయం చేయాలని కోరుతూ సిపిఐ మరియు దళిత సంఘాల నాయకులు శనివారం కొండపి తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ మురళిని కలిసి వినతి పత్రం అందించారు. బాధిత దళిత మహిళ చుండి గోవిందమ్మ తెలిపిన వివరాల మేరకు కొండపి మండలం చోడవరం గ్రామానికి చెందిన అగ్రకుల కుటుంబం మాఇంటిలో నుండి బయటకు నడవడానికి వీలు లేని పరిస్థితులు కల్పిస్తూ ఉన్నారని వాపోయారు. గూడూరి అన్నపూర్ణ అలియాస్ అన్నపూర్ణమ్మ భర్త వీర రాఘవులు అను మహిళ సుమారు నెలరోజుల నుండి దారిలో నడవకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తూ కులం పేరుతో దూషిస్తూ చెత్త మరియు అశుద్ధాన్ని మా ఇంటి ముందు పోస్తూ మీ మాల మాదిగ కులాలకు చెందిన వాళ్ళు ఈ దారిన నడవడానికి వీలులేదని అసభ్య పదజాలంతో దూషిస్తున్నట్లు చుండి గోవిందమ్మ వాపోయారు. కొండపి మండల తహసీల్దార్ వారు మమ్మల్ని కలవలసినదిగా మాకు నోటీసులు ఇవ్వగా ఈ నోటీసుపైన మేము శనివారం అనగా 15 తేదీన తహసీల్దార్ వారికి స్టేట్మెంట్ ఇచ్చాము అని తెలిపింది. కొండపి మండలం తహసీల్దార్

వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : వెలుగొండ ప్రాజెక్టుకు 2000 కోట్ల బడ్జెట్లో నిధులు కేటాయించాలని శనివారం సిపిఎం పార్టీ గిద్దలూరు శాసనసభ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వెనుకబడ్డ పశ్చిమ ప్రకాశం అభివృద్ధి జరగాలంటే జీవనాధారమైన వెలుగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తి అయ్యి ఆ ప్రాజెక్టు నీళ్ళ సాగుకు, తాగుకు రావడంతో పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రాజెక్టు పూర్తి అయ్యేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో 2000 కోట్లు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న శాసనసభ సభ్యులందరూ కూడా రేపు జరగబోయే శాసనసభ బడ్జెట్ సమావేశంలో వెలిగొండ ప్రాజెక్టుకు అధిక నిధులు అడిగేందుకు జిల్లా మంత్రులు శాసనసభ సభ్యులు అందరం కూడా కృషి చేస్తామని అన్నారు. ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు టి ఆవులయ్య బి నరసింహులు జే అల్లూరి స్వామి శ్రీను డివిజన్ మూర్తి కే అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛ వాతావరణం

విశాలాంధ్ర - తాళ్లూరు: పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛ వాతావరణం, ఆరోగ్యం ఉంటుందని ఎంపీడీఓ దార హనుమంత రావు అన్నారు. నాగంబొట్ల పాలెం గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పలు చోట్ల చెత్త నిల్వలను తొలగించారు. వాగు వద్ద పేరుకు పోయిన చెత్తను తీయించారు. గ్రామంలో చెత్త బుట్టలు పంపిణీ చేసారు. ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకులు సానికొమ్ము సత్యం, సర్పంచ్ చిమట సుబ్బారావు, కార్యదర్శి ఐవీ రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.వెలుగు వారి పాలెంలో ప్రాథమిక పాఠశాల (ఎ)లో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయుడు పోలం రెడ్డి సుబ్బా రెడ్డి ఆధ్వర్యంలో మొక్కల పెంపకం ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులచే శ్రమ దానం చేసారు.

ఇంకుడుగుంత ప్రారంభం

విశాలాంధ్ర-కొమరోలు : స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొమరోలు మండలంలో మంజూరు కాపాడిన 343 సోక్ పిట్లు అన్ని గ్రామ పంచాయతీలలో గ్రౌండ్ చేయడం జరిగింది. ఇందులో భాగంగా కొమరోలు మండలం నందు కొమరోలు గ్రామపంచాయతీ గోపాలునిపల్లి గ్రామానికి సంబంధించిన వర్రా భాస్కర్ లబ్ధిదారునికి మంజూరు కాపాడిన ఇంకుడు గుంతను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ మస్తాన్వలి ఏపీఓ ఆర్ మహాలక్ష్మి, ఈవోపిఆర్‌డి ఆర్ డి బ్రహ్మయ్య పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సాంకేతిక సహాయకులు కటారు శ్రీనివాసులు ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఎస్ కోటిరెడ్డి, క్షేత్ర సహాయకులు గ్రామ ప్రజాప్రతినిధులు గ్రామస్తులు హాజరుకావటం జరిగినది. ఈ ఇంకుడు గుంతల వలన గ్రామాలలో మురుగు నీరు భూమిపై ప్రవహించకుండా దానివల్ల వచ్చే అంటూ వ్యాధుల నుండి కాపాడుకోవచ్చు అలాగే గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు ఉపయోగపడతాయి దీనితోపాటు భూగర్భ జలాలను కూడా పెంపొందించుకోవడానికి ఈ సోప్ పిట్ లు ఉపయోగపడతాయి కావున అందరూ ఎక్కడైతే మురుగు నీరు రోడ్డు పైకి వస్తుందో మరియు భవనాల పైన పడినటువంటి నీరు ఇంకేమైనా ఇతరత్రా కార్యక్రమాలకు వాడినటువంటి నీరు ఇంటి నుంచి బయటకు వెళ్ళేటటువంటి ప్రాంతంలో ఈ సోక్ పిట్టును నిర్మించుకొని ఇటు ఆరోగ్యాన్ని అటు భూగర్భ జలాలను పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది. కావున సోక్ పిట్నిర్మాణము చేపట్టాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని నరవ గ్రామ ఎస్సీ పాలెంలోని నీటి సమస్యను గ్రామ సర్పంచి బండి శ్రీనివాసులు పరిష్కరించారు. పంచాయతీ నిధుల నుండి గతంలో బోర్ వేయించిన సర్పంచ్ శ్రీనివాసులు రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎస్సీపాలెం ప్రజలకు నీటి సమస్య ఉండకూడదని శనివారం బోర్‌కు మోటారు ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించారు. సర్పంచ్ బండి శ్రీనివాసులుకు ఎస్సీ పాలెంవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

☞ రేపు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి

☞ సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపు

విశాలాంధ్ర-మార్కాపురం : నిరంతరం కరవు కాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రకాశానికి వరప్రసాదమైన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు వచ్చే బడ్జెట్లో రెండువేల కోట్ల ను కేటాయించాలని, అలాగే ముంపు గ్రామాల బాధితులకు ఆర్ఆర్ ప్యాకజీ మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల 17వ తేదీ మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం, కనిగిరి ఆర్డిఓ కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం ఉదయం స్థానిక పూల సుబ్బయ్య శాంతిభవన్‌లో పార్టీ పట్టణ కార్యదర్శి చిత్తారి పెద్దన్న అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ గత ఏడు దశాబ్దాలుగా పశ్చిమ ప్రకాశం పాలకుల నిర్లక్ష్యానికి గురవుతూనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు వెలిగొండ ప్రాజెక్టును రాజకీయంగా వినియోగించుకుని ఓట్లు లబ్ధి పొందుతున్నారే తప్ప ఆచరణలో నిర్మాణ పనులు పూర్తి చేయడం లేదని విమర్శించారు. మూడు దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేసినప్పటికీ ఈ ప్రాజెక్టు నేటికీ పూర్తి కాలేదంటే ఇటు టీడీపీ అటు వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు నైతిక బాధ్యత వహించాలని ఆయన అన్నారు. వర్షాధారం తప్ప మరో నీటి ప్రత్యామ్నాయం లేని పశ్చిమ ప్రకాశానికి కృష్ణా జలాలే శరణ్యమని సిపిఐ ఆధ్వర్యంలో స్వర్గీయ పూల సుబ్బయ్య, గుజ్జుల యలమందరెడ్డి ,స్థాని కొమ్ము కాశిరెడ్డి ,రావులపల్లి చెంచయ్యల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరిగిన పోరాటాల ఫలితంగానే ఈ ప్రాజెక్టుకు 1996 లో నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల ప్రజలకు నేటికీ ఆర్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయకపోవడం దుర్మార్గమైన చర్యని ఆయన అన్నారు. ఇప్పటికైనా ముంపు గ్రామాల బాధితులను దృష్టిలో ఉంచుకొని వెంటనే పునరావాస చర్యలు చేపట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వేసిన పంటలు పండక పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ.. మరోవైపు గత్యంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వ్యవసాయ కూలీలు ఇతర జిల్లాలకు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు సీపీఐ పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. హనుమారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రాంతం ఏదైనా ఉందంటే అది ఒక్క పశ్చిమ ప్రకాశం మాత్రమేనని అన్నారు. ఈ విషయాన్ని మేము తేలిగ్గా చెప్పడం లేదని, శాటిలైట్ ద్వారా ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పాలకులు తిరోగ మన విధానాల నేపథ్యంలో వ్యవసాయ రంగం కూడా నేడు తీవ్ర సంక్షోభంలోకి కురక పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 17 న వెలిగొండ ప్రాజెక్టు కోసం జరిగే ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమారెడ్డి రైతు లోకానికి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కే కాసిం నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు కొండయ్యలు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకల్లో 'మన్నం'

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో ఏలూరు కొండయ్య నిర్మల దంపతుల కుమార్తె మనీషా శబరినాథ్ నిశ్చితార్థ వేడుకలు శనివారం నిర్వహించారు. మండల తెలుగుదేశం అధ్యక్షులు మన్నం రమణయ్య, మోపాడు రిజర్వాయర్ సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, ఏలూరి నరసింహారావు, గోళ్ళ కొండయ్య, గోళ్ళ వీరబాబు, గోళ్ళ మాలకొండయ్య తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

స్వచ్ఛాంధ్ర ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-పామూరు రూరల్ : దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనునట్లు డి ఎల్ డి ఓ. కే శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి ఎల్‌డిఓ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఎంపీడీవో బి సురేష్, ఉపసర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవింద రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రత్నకుమార్, సచివాలయం సిబ్బంది, క్లాత్ మిత్రులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలులోని ప్రముఖ శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యొక్క 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ 2013 వ సంవత్సరంలో ఒక చిన్న క్లినిక్‌గా మొదలు అయిన శ్రీరామ్ హాస్పిటల్ ప్రస్థానం 12 రకాల మల్టీస్పెషాలిటి వైద్య సేవలు అందించే స్థాయికి హాస్పిటల్ ఎదిగి దిగ్విజయంగా పుష్కరకాలం పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది అని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల డాక్టర్ చాపల వంశీకృష్ణ ఎదిగిన విధానం ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోందని, సముద్ర తీర ప్రాంతమైన కొత్తపట్నం- పల్లెపాలెం గ్రామం నుండి ఈరోజు అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన విధానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం అని తెలియజేశారు. అలాగే శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపల వంశీ కృష్ణ, చాపల శాంత కుమారి దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా 12వ వార్షికోత్సవం కేక్‌ని కట్ చేసి అందరికీ అభినందనలు తెలియజేశారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ 12వ వార్షికోత్సవ సందర్భంగా ఒంగోలులోని పాఠశాలలకు వైద్యరంగం మీద నిర్వహించిన క్విజ్ పోటీలలో పాల్గొని విజేతలు అయిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. హాస్పిటల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగస్తులకు అవార్డులు ప్రధానం చేశారు. మండవ మురళీకృష్ణ, తేళ్ల అరుణ, కార్పొరేటర్లు గురవయ్య , మల్యాద్రి, సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ రమణా రెడ్డి, సామాజిక కవి పిన్ని వెంకటేశ్వర్లు, హైకోర్టు లాయర్ ఇస్మాయిల్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఇస్మాయిల్, ఆంధ్ర ప్రదేశ్ బీసీ ఉద్యోగస్తుల అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ బక్కమంతుల వినయ్, హస్పిటల్ వైద్యులు డాక్టర్ సానల ధీరజ్ బాబు, డాక్టర్ కుమార్ వర్మ , డాక్టర్ జెరుషా జాస్మిన్, డాక్టర్ సుధీర్, డాక్టర్ సరయు, డాక్టర్ పల్లవ్, డాక్టర్ ఏడుకొండలు,జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్ ,మార్కెటింగ్ మేనేజర్ ఖాసిం సైదా, ఒంగోలులోని ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు మంజూరు చేయాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని మధ్యాహ్న భోజనం కార్మికులకు కొన్ని నెలల నుండి వేతనాలు, బిల్లులు రాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు విశ్వరూపాచారి తెలిపారు. ఈ సందర్భంగా విశ్వరూప ఆచారి మాట్లాడుతూ బడి పిల్లలకు నాణ్యమైన భో జనం పెటిన్నప్పటికిని ఇంతవరకు బిల్లులు, వేతనాలు ఇవ్వలేదని, డిసెంబర్ నుండి పెంచిన బిల్స్, ప్రభుత్వం వెంటనే బిల్లులు వేతనాలు సకాలంలో ఇవ్వకపోతే వంటలు బందు చేసీ పోరాటాలు ప్రారంభిస్తామని ప్రభుత్వాన్ని అయన డిమాండ్ చేశారు.

ప్రాంగణ ఎంపికల్లో ఎస్ఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

విశాలాంధ్ర -ఒంగోలు: స్థానిక మంగమూరు రోడ్ లోని ఎస్ ఎస్ ఎన్ డిగ్రీ కళాశాల ఆవరణంలో అల్డిగి టెక్ ఎంఎన్ సి కంపెనీ వారు నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్స్‌లో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ యల్లటూరి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక కళాశాల ఆవరణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు జాయినింగ్ ఆఫర్ లెటర్స్ వెంటనే ఇచ్చినట్లు తెలిపారు. కంపెనీ ప్రతినిధులు సురేందర్, సుభాని, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ టీ రాజశేఖర్ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పొదిలిలో బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, జేఏసి బృందం పర్యటన

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పట్టణంలో ఉపాధ్యాయులు సజీవరావు హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, జేఏసీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశం ఉపాధ్యాయులు సజీవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, జేఏసీ చైర్మన్ మాదాసు రంగనాయకులు, వైస్ చైర్మన్ నల్ల పోతుల శ్రీనివాసరావు, డిప్యూటీ సెక్రటరీ : దేవలూటి శంకర్ హాజరైనారు. ఈ సమావేశంలో బీసీ ఉద్యగుల యూనిటీ గురించి, సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, సభ్యత్వ నమోదు కార్యక్రమం అట్టహసంగా జరిగింది. ఉపాధ్యాయులు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లే విధంగా కార్యాచరణ సిద్ధం చేయడం జరిగింది. ఈ సమావేశంలో యూ. శ్రీనివాసరావు, సీతారామయ్య, గోనె శ్రీనివాసులు, వి. కృష్ణంరాజు, ఎం.ఏన్. నాగార్జునరావు, వై. హరిబాబు, సిహెచ్ శేషారావు,జె. వెంకటేశ్వర్లు, పి. కిరణ్ కుమార్, సి. హెచ్ వి. మురళీకృష్ణ, ఎస్ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేస్‌లో పూర్వ విద్యార్థి దిశా నిర్దేశం

విశాలాంధ్ర-ఒంగోలు: స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగానికి సంబంధించి తృతీయ సంవత్సర విద్యార్థులకు పూర్వ విద్యార్థి షేక్ సమీర్ విభాగానికి సంబంధించి లిహౌ టు గ్రూమ్ యువర్ సెల్ఫ్ ఇన్ ఐటీ సెక్టార్‌లి అనే అంశంపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఐటీ రంగంలో సంక్షోభాన్ని ఎదుర్కోవాలంటే , మలుచుకోవాలో మన నైపుణ్యాలని ఏ విధంగా పెంపొందించుకోవాలో తెలియజేశారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్రీ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ సి వి సుబ్బారావు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు, కంప్యూటర్ సైన్స్ విభాగధిపతి డాక్టర్ ఎస్ గిరిబాబు, ఈవెంట్ కోఆర్డినేటర్ మౌనిక పాల్గొన్నారు.

జన విజ్ఞానం కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర - చీరాల : అభ్యుదయ భావాల ప్రచారం కోసమే ఊరురా జన విజ్ఞానమని ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ఊరురా జన విజ్ఞానం, ప్రజా సంఘాల ఐక్యవేదిక సీనియర్ సిటిజన్ అసోసియేషన్, ఘంటసాల చైతన్య వేదిక,వేమన సాహితీ సమితి,అభ్యుదయ భావాల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో చీరాల ఘంటసాల విగ్రహం వద్ద ఊరూరా జన విజ్ఞా నం సాంస్కృతిక చైతన్యం ప్రజల్లోకి 10 అంశాలు కరపత్రాలను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఘంటసాల గానం అమరమని ఎప్పటికీ తెలుగువారి హృదయాల్లో నిలిచే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బక్క జయరామిరెడ్డి, ఇమ్మడిశెట్టి గోపాలకృష్ణ,తన్నీరు విజయ్,లీలాధర్ రాజు,కే. మల్లికార్జునరావు, ఏవి రావు ఆర్టిసి, ఎన్.గోవింద్, పుష్పరాజు, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నా యని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని అన్నారు. శనివారం మండల కార్యాలయం లో వ్యవసాయ, రెవెన్యూ పంచాయతీరాజ్ తదితర గ్రామ సచివాలయ సిబ్బందితో ఈ కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఏ.మహేష్ బాబు మాట్లాడుతూ మండలం లోని అన్ని రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు, సచివాలయ సిబ్బంది రైతులకు ఉచితంగా గుర్తింపు కార్డులు నమోదు చేస్తారని, రైతులందరూ ఈనెల 25వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ లింక్ అయి ఉన్న మొబైల్ ఫోన్ తో రైతు సేవా కేంద్రం లేదా గ్రామ సచివాలయంలో నమోదు చేయించుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికా రులు దాసరి మాధవి, మిద్దె తిరుపతమ్మ, పులిగడ్డ ప్రియాంక, గ్రామ వ్యవసాయ సహాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలం లోని అన్ని పంచాయతీల పరిధిలో పరిసరాల పరిశుభ్రత మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసన్, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ పర్సన్ పులిగడ్డ వెంకటప్రసాద్, ఎంఈఓ నవీన్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాటూరు లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు

- చీరాల ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది పై చర్యలు తీసుకోవాలి
- జేసికి వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర - చీరాల : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే బాధితుల వార్తలను కవర్ చేసే విలేఖరుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డ్యూటీ డాక్టర్ హేనా, సూపరింటెండెంట్ సుభాషిణిలపై చర్యలు తీసుకోవాలని పలువురు చీరాల జర్నలిస్టులు కోరారు. శనివారం బాపట్ల జాయింట్ కలెక్టర్ ప్రఖార్ జైన్, వైద్యవిధాన్ పరిషత్ డిసి శేషు కుమార్‌లకు జర్నలిస్టులపై నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్న చీరాల ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తీరుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తారన్నారు. క్రైమ్ వార్త లు, యాక్సిడెంట్ వార్తలు కవర్ చేసే సమయంలో ఏదైనా సమాచారం అందించాల్సిన డాక్టర్లు జర్నలిస్టులపై అనుచితంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జర్నలిస్టుల ఆత్మాభిమానం దెబ్బతినేలా వ్యవహరిస్తు న్నారని దీనిపై ఉన్నతాధి కారులు చర్యలు తీసుకో వాలని కోరారు. గతంలో ఇదే మాదిరిగా జర్నలిస్టు లపై డ్యూటీలో ఉన్న డాక్టర్లు అనుచితంగా వ్యవహరిస్తే సూపరింటెండెంట్ సుభాషిణి దృష్టికి తీసుకెళ్లామని మరల అదే పనిగా జర్నలిస్టుల ఆత్మా భిమానం దెబ్బతినేలా చీరాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సిబ్బంది వ్యవహరిస్తున్నారన్నారు. ఒక బాధిత యువతి వార్త కవర్ చెయ్యడానికి రమ్మని పిలిస్తే అక్కడకు వెళితే అనుచిత వ్యాఖ్యలు చేసి బయటకు జర్నలిస్టును (విశాలాంధ్ర కాదు) పంపించారని ఆ బాధిత యువతి సిబ్బంది నిర్లక్ష్యానికి బలి అయ్యిందన్నారు. వైద్యుల తప్పులు బయటకు రాకుండా సరిచేసుకునేందుకు జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆసుపత్రిలోకి రానివ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జర్నలిస్టులపై అనుచితంగా ప్రవర్తించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్,జర్నలిస్టులు గుమ్మడి సూర్య ప్రకాష్, దేవరపల్లి దిలీప్,బత్తుల దుర్గాప్రసాద్, రత్నబాబు, రాంబాబు, మస్తాన్ వలీ, రాజేష్, కంచర్ల రాగ దీప్ తదితరులు పాల్గొన్నారు.

భాషా నైపుణ్యంలో విద్యార్థులకు మెళకువలు నేర్పించాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : భాష నైపుణ్యాలలో విద్యార్థులకు మెళకువలు నేర్పించాలని ఎంఈఓ సిహెచ్ గోపి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల కస్టర్ల సమావేశంలో జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాల కోఆర్డినేటర్ సత్యసాగర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతిరోజు పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, సిలబస్ ఎంతవరకు పూర్తి అయింది, సి,డి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో ఎలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఇంగ్లీషు బోధనలో మెళకువలు గణితం సులువుగా ఎలా బోధించాలి, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఐదు తరగతులు ఎలా బోధించాలి, బోధనలో సూచించిన లక్ష్యాలను ఎలా చేరుకోవాలి, కష్టమైన పాఠ్యాంశాలను పాఠశాలల్లో సులువుగా ఎలా బోధించాలి,బోధనలో మెళకువలను వీడియోల ద్వారా ఉపాధ్యాయులకు ప్రదర్శించి, ఉత్తమ బోధనా పద్ధతులు గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ ఎం.దేవేంద్రరావు,ప్రధానోపాధ్యాయులు రావి శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల కూటమి బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు కారుమూరి ఆంజనేష్ అన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఆదేశాల మేరకు 16 వార్డు భీమవారిపాలెంలో డోర్ టు డోర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భీమా కోటేశ్వరరావు, పసులేటి శివ, నెల్లూరు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం,రక్షణ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అదవి గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డిపిఓ కె.ఎల్.ప్రభాకరరావు, ఎంపిడిఓ బాబురావు పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు నూతన యూనిఫాం, రక్షణ కిట్లు పంపిణీ చేశారు. పంచాయతీ సిబ్బంది, కార్మికులతో కలసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్ ఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, ఎంఆర్‌సి శశి కిరణ్, పంచాయతీ కార్యదర్శులు విజయ సారథి, బాబురావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రతి ఒక్కరూ తమ చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి కృష్ణ కిషోర్ సూచించారు. మండల కేంద్రమైన నిజాంపట్నంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఇందులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నిజాంపట్నం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు,హౌసింగ్ అధి కారులు సుబ్బారావు, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అవయవదానంతో మృత్యుంజయులు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అవయవ దానంతో మృత్యువును జయించవచ్చు అని ప్రకృతి సూత్రాన్ని అంది పుచ్చుకొని,మానవులు అవయవ దానం చేసి మరణించిన తర్వాత కూడా జీవించాలని అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సూపరిం టెండెంట్ డాక్టర్ రమణ యశస్వి పిలుపునిచ్చారు.డాక్టర్ కృష్ణ మూర్తి విద్య,వైద్య రంగాల్లో బాపట్లకు విశేషమైన సేవలందించారన్నారు. శనివారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేహదానం వైద్య రంగంలో పరిశోధనలకు ఊతమిస్తుందన్నారు. ఎందరో అభాగ్యులు అవ యవదానం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. పిఎస్‌కే విద్యాసంస్థల చైర్మన్ సునీల్ కుమార్ మాట్లడుతూ అవయవదానంతో అమర త్వం పొందవచ్చు అని పిలుపునిచ్చారు. బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టరు కె.సిద్ధార్థ మాట్లాడుతూ అవయవదానంపై అపో హాలువీడి, ప్రతి ఒక్కరు అవయవదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఆర్ట్స్ కళా శాల విశ్రాంత ప్రిన్సిపల్ దబ్బుజికె మూర్తి,గుంటూరు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ తాతా సేవా కుమార్ ప్రసంగించారు. సభకు ఫోరం కార్య దర్శి డాక్టర్ పిసి సాయిబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్య క్షులు కె.శ్రీహరి రావు, విశ్రాంత అధ్యాప కులు గోరంట్ల శాంతరామ్, జివి సుబ్రహ్మణ్యం, గురజాల శ్రీనివాసరావు, చిత్రకారుడు జీవి, ప్రస న్నాంజనేయులు, వాసుదేవరావు, ఇక్కుర్తి శ్రీని వాస్, కరణం రవీంద్ర, పువ్వాడ బసంత్ కుమార్, తులసి చంద్రశేఖర్, సత్యనారాయణ, చిన భూష ణం, ఎస్‌కే విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి పునాదుల్లో బయటపడ్డ పురాతన పోతురాజు విగ్రహం

విశాలాంధ్ర - బల్లికురవ : నూతన ఇల్లు నిర్మించుకునేందుకు పునాదులు తీస్తుండగా పురాతన పోతరాజు విగ్రహం బయట పడ్డ సంఘటన సంతమాగులూరు మం డలంలో శనివారం జరిగింది. సంతమాగులూరు గ్రామ మాజీ సర్పంచ్ జమ్ముల నాగ రాజు కుటుంబీకులు నూతన ఇల్లు నిర్మించు కునేందుకు ఇంటి పునాదులు తీస్తుండగా పునాదులు తీసే కూలీలు పొడవైన రాతిని వెలికితీశారు. దానిని పరిశీలించగా పురాతన పోతురాజు స్వామి విగ్రహంగా గుర్తించారు. భయాందోళనకు గురైన జమ్ముల కుటుంబీ కులు పరిసర నివాసాల వారు ఆ విగ్రహాన్ని కడిగి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల సలహా మేరకు విగ్రహాన్ని స్థానిక శివాలయానికి చేర్చి భద్రపరిచారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - చీరాల : సీనియర్ సిటిజన్స్ సమాఖ్య చీరాల కార్యాలయంలో ఆదివారం ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఎముకలకు సంబంధించిన సమస్యలు ఉన్న వారు ఈ వైద్య శిబిరంలో పాల్గొనాలని ఏపి సీనియర్ సిటిజన్స్ సమాఖ్య ప్రధాన కార్యదర్శి అత్తులూరి రామారావు పత్రిక ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ సమాఖ్య చీరాల శాఖ ఆధ్వర్యంలో జరిగే వైద్య శిబిరంలో హవిష్ ఆర్థో వైద్యులు డాక్టర్ చెన్నకేశవ రావు సజ్జా, ఆర్థోప్రముఖ ఎముకల,కీళ్ల వైద్యులు మెడికల్ క్యాంప్‌లో పాల్గొంటారన్నారు. సమస్యలు ఉన్న వారిని పరీక్షించి మందులు ఇస్తారని ఏపీ సీనియర్ సిటిజన్స్ ప్రధా కార్యదర్శి అత్తులూరు రామారావు తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన

విశాలాంధ్ర - అద్దంకి : పోషకాహారంతో కూడిన ఆహారాన్ని అందించాలని కొరిశపాడు సిడిపిఓ కృష్ణకుమారి అంగన్వాడి కార్యకర్తలకు సూచించారు. పోషణ్-భీ,పఢాయ్-భీపై మూడో రోజు శిక్షణ కార్యక్రమాన్ని అద్దంకి ఎంఆర్సి కార్యాలయం లో నిర్వహించారు. పోషకాహారం లోపం వలన కలిగే వ్యాధులు, తీసుకోవా ల్సిన జాగ్రత్తలు, తల్లిపాలపై అవగాహన కార్యక్రమాన్ని డిజిటల్ రూపంలో అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - అద్దంకి : స్వచ్ఛ ఆంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పట్టణ పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కాకానిపాలెంలో స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. పరిసరాలు పరిశు భ్రంగా ఉంచేందుకు అందరూ శ్రమించాలని శానిటేషన్ కార్యదర్శి రీనా చక్ర వర్తి అన్నారు. కార్యక్రమంలో అద్దంకి మాజీ సర్పంచ్ సంధిరెడ్డి శ్రీనివాసరావు, మున్సిపల్, సచివాలయ, మెప్మా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల శ్రమదానం

విశాలాంధ్ర - అద్దంకి : స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అద్దంకి మండ లంలోని సింగరకొండ వద్ద ఉన్న కెఆర్కె ప్రభు త్వ డిగ్రీ కళాశాల విద్యా ర్థులు శనివారం కళాశాలలో శ్రమదానం నిర్వ హిం చారు. చీపుర్లు చేత పట్టి కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. స్వచ్ఛ ఆంధ్రలో ప్రతి ఒక్కరం భాగస్వాములుగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుదాం

విశాలాంధ్ర - యద్దనపూడి : స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర 2047 కార్యక్ర మంలో భాగంగా, మండలంలోని వింజనంపాడు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రామ టిడిపి నాయకులు ప్రారంభించారు. గ్రామంలో ప్రతి ఇంటికి చెత్తను సేకరిం చేందుకు డబ్బాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ తోడ్పడాలని, ఇదే విధంగా తమ ఇంటి పరిసరాలు కూడా శుభ్రపరుచుకోవాలని సూచించారు. వ్యర్థా లను తడి, పొడిగా విభజించి వేరు వేరు డబ్బాలలో సేకరించుకోవాలని ప్రజ లను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వజ్జా సుబ్బరామయ్య, సాధినేని రంగారావు, సాదినేని సుధీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింగరకొండ ఉద్యోగుల స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ

విశాలాంధ్ర - అద్దంకి : స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా శనివారం సింగర కొండ ప్రసన్నాంజ నేయ స్వామి దేవ స్థానంలో ఆలయ ఉద్యోగులు స్వచ్ఛ ఆంధ్ర సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో తిమ్మనాయుడు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి అనగాని సహకారంతో

రేపల్లె డిపోకు 12 కొత్త బస్సులు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె ఆర్టీసీ ప్రయాణికుల మెమోరాండాలు, విజ్ఞాపనలతో రేపల్లె ఆర్టీసీ డిపోకు 12 కొత్త బస్సులు మంజూరయ్యాయి.ఏళ్ల తరబడి రేపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో కాలం చెల్లిన బస్సులలో ప్రయాణికులు ప్రయా ణిస్తూ తమ విసుగును ప్రభుత్వానికి మొరపెట్టుకోవటంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం,రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో రేపల్లె ఆర్టీసీ డిపోకు శనివారం 12 కొత్త బస్సులు డిపోకు చేరుకున్నాయి.బాపట్ల జిల్లా కేంద్రం అయినప్పటికిని రేపల్లె నుండి బాపట్లకు ఎక్స్ప్రెస్ సర్వీసులు లేకపోవటంతో ప్రయాణికులు నానా అగచాట్లకు గురవుతున్నారు. ఈ కొత్త బస్సులను అయినా రేపల్లె-బాపట్ల ఎక్స్ప్రెస్ సర్వీసులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఏబిఆర్ కళాశాలలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'

విశాలాంధ్ర - రేపల్లె : స్థానిక ఏబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ బాపట్ల వారి సూచనల మేరకు కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ టిసి రవిచంద్ర కుమార్ అధ్యర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర 2047 కార్యక్రమంలో భాగం గా, కళాశాల స్కిల్ హబ్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వ హించారు. కార్యక్రమ నిర్వహణ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.దాసు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఇంటి పరిసరాలు కూడా శుభ్రపరుచు కోవాలని సూచించారు. వ్యర్థాలను తడి,పొడిగా విభజించి వేరు వేరు డబ్బాలలో సేకరించుకోవాలని విద్యార్థులను కోరారు. స్వర్ణ ఆంధ్రా-స్వచ్ఛ ఆంధ్రా కమిటీ సభ్యులైన డాక్టర్ ఎం.బుజ్జి బాబు మాట్లా డుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మొదలు పెట్టిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు తప్పకుండా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్కిల్ హబ్ సమన్వయకర్త బి.కోటేశ్వర రావు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సిహెచ్ రవికుమార్,ఆంగ్ల అధ్యాపకులు కే.బాలగురవయ్య,ఐ.క్యూ.ఏ.సీ కోర్డినేటర్ డాక్టర్ ఎం నర్సయ్య,జూనియర్ అసిస్టెంట్ ప్రసన్న కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

విశాలాంధ్ర - యద్దనపూడి : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని డాక్టర్ హర్షసీడీపీవో జి.సుభద్ర అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన పోషణ్-భీ, పడాయ్-భీ కార్యక్రమం లో వారు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ మూడవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగం గా బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యక తపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టడంపై అవగాహన కలిగి ఉండా లన్నారు. ముర్రుపాలతో శిశువుకు వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, సంవత్సరం వరకు పాలు పట్టాలని సూచించారు. వికలాంగులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథ కాలు, ఉపాధి కల్పన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సిహెచ్ సుజాత, జి.తులసి, నారాయణ అనూరాధ, హేమలత దేవరాణి, రత్నకుమారి, జి.నవమ్మ, జోస్న అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - పర్చూరు : ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచు కున్నట్లయితే ఆరోగ్యం గా ఉంటారని ఎంపిడిఓ ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయం వద్ద శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ ప్రజల్లో తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన ఉండాలని, పారి శుధ్య కార్మికులు గృహాల వద్దకు వచ్చిన సమయంలో వారికి సహకరించాలని తెలిపారు. ర్యాలీకి ముందు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లా అంజమ్మ, కార్యదర్శి ఆళ్ళ మస్తాన్‌రావు, సభ్యులు షేక్ గౌస్ బాషా, వెల్ఫేర్ అసిస్టెంట్ బిరుదు నాగేశ్వరరావు, మల్లా శ్రీనివాసరావు, పంచాయతీ కార్మికులు, సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ప్రతి నెలలో మూడవ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ పారిశుధ్య కార్యక్రమం చీరాల మండలం తోటవారిపాలెం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం ఇంటింటికి ర్యాలీగా వెళ్లి పారిశుద్ధ్యం పరిశుభ్రతల గురించి స్థానిక నాయకులు, అధికారులు వివరించారు. పరిసరాల్లో మొక్కలు నాటి వీధులు శుభ్రం చేశారు.స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మేడికొండ భారతి,మారుతి,సచివాలయం 1,2, సిబ్బంది,గూడూరు శివరామ ప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త బస్టాండ్‌లో స్వచ్ఛత కార్యక్రమం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. బాపట్ల కొత్త బస్ స్టేషన్‌లో ప్రభుత్వ పిలుపు మేరకు డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం ద్వారా బస్ స్టేషన్ పరిసరాలు శు భ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్, ట్రాఫిక్ ఇంచార్జ్ పి.నాగేశ్వరావు, అసోసియేషన్ నాయ కులు డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు. డిపో మేనే జర్ గ్యారేజ్ ఇంచార్జ్ రామకృష్ణ ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది కలసి గ్యారేజ్‌లో మొక్కలు నాటి, స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాలకు ఆపన్నహస్తం

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరు, నూతల పాడులోని వృద్ధాశ్రమాలకు సూర్యశ్రీ దివ్యాంగుల చారి టబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సర్దార్ బాషా దాతల సహకా రంతో రూ.25 వేల విలువగల నిత్యావసర సర కులు, వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో జెర్సీ పాల సంస్థ ప్రతినిధి అనిల్, ఆశ్రమ నిర్వాహకులు సాయి, శ్రీని వాసరెడ్డి, జయలక్ష్మీ ఉన్నారు. సంస్థ సమన్వయకర్త సాయి ధన్యవాదములు తెలిపారు.

స్వామివారి ఆలయంలో స్వచ్ఛాంధ్ర

విశాలాంధ్ర - పర్చూరు : ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా మండలంలో వేంచేసియున్న శ్రీత్రివిక్రమ, అగస్త్యేశ్వర స్వామి వార్ల ఆలయాల ప్రాంగణంలో శని వారం ఆలయ సిబ్బంది, భక్తులు పరిసరాలను శుభ్రం చేశారు. ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల : విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా రోడ్డు భద్రత నిబంధనలపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలను కలెక్టర్ జె.వెంకట మురళి అభినందించారు. స్థానిక బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రవాణా శాఖ వారు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్స్‌తో పాటు మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయస్సులో నిబంధనలను తెలియచెయ్యడం వలన అవి వారి మెదడుపై బలంగా ప్రభావం చూపుతాయని భవిష్యత్తులో వారు ప్రమాదాల భారిన పడకుండా కాపాడటంతో పాటుగా వారు మిగిలిన వారిని కూడా చైతన్యవంతులను చెయ్యగలుగుతారన్నారు.పిల్లలకు అర్హత కలిగిన వయస్సు వచ్చి డ్రైవింగ్ లైసెన్స్ పొందే వరకు వాహనాలు నడుపుటకు అనుమతిని ఇవ్వవద్దని తల్లితండ్రులను ఈ సందర్భంగా ఆయన కోరారు. డిస్ట్రిక్ట్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ టి.కె పరంధామ రెడ్డి మాట్లాడుతూ తాము నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీల్లో 8వ తరగతికి చెందిన పి.శ్రీవల్లి మొదటి బహుమతి,9వ తరగతికి చెందిన జె.షణ్ముఖ ప్రియ రెండవ బహుమతి,6 వ తరగతికి చెందిన టి.సన్నిధి మూడవ బహుమతి,7వ తరగతికి చెందిన ఎన్.మాధురి,5 వ తరగతికి చెందిన పి.వర్షికలు కన్సోలేషన్ బహుమతులు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎన్.ప్రసన్న కుమారి,అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి.అంకమ్మరావు, రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ ఎ.నరేంద్రకుమార్, బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు జి.హేమలత, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర- చీమకుర్తి : చీమకుర్తి బివిఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో రోడ్డు భద్రత పై విద్యార్థులకు సీఐ సుబ్బారావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లైసెన్స్ కూడా ఉండాలని, నడిపే వాహనాలు విపరీతమైన స్పీడ్ తో వెళ్లడం వలన ఎదుటి వారికి కూడా ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చీమకుర్తి ప్రభుత్వ బాలిక హాస్టల్ సందర్శించి వారికి మహిళలు చిన్నపిల్లల్లో జరుగు నేరాలు గురించి అక్కడ ఉన్నటువంటి వసతులు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్, లెక్చరర్స్, టీచర్లు పాల్గొన్నారు.

గోశాలకు వరిగడ్డి వితరణ

విశాలాంధ్ర - అద్దంకి : రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక హరిహర గోశాలకు కారంచేడుకు చెందిన ఘంటా గిరీష్ కుమార్ ఇతర రైతులు రూ.50 వేలు విలువ కలిగిన వరిగడ్డిని శనివారం అందచేశారు. దాతలను రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు. సమాజానికి అన్ని విధాలుగా ఉపయోగపడే గోజాతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి మురళి, మల్లాది శ్రీనివాసరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అందుబాటులో గుండెపోటు ఇంజక్షన్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు 40కె ఇంజక్షన్ అందుబాటులో ఉంచారని, ఒక్కో ఇంజక్షన్ ఖరీదు సుమారు రూ.45 వేల రూపాయలని జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ శేషకుమార్ తెలిపారు. పట్టణంలోని ఏరియా హాస్పిటల్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శేషకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలు ఉన్నప్పుడు గ్యాస్ ప్రాబ్లం అని నిర్లక్ష్యం చేయకుండా ఏరియా హాస్పిటల్‌లో పరీక్షలు చేయించుకుని గుండెను భద్రంగా కాపాడుకోవాలని తెలిపారు. పోస్టర్‌ను ఆవిష్కరించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ సిద్ధార్థ్, డాక్టర్ బాలసుధ, డాక్టర్ రత్నాంజలి, నర్సింగ్ సూపరిండెంట్ వరలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు సేవలు సద్వినియోగించుకోవాలి

రీజనల్ మేనేజర్ బియన్‌యం శశిధర్‌రావు

విశాలాంధ్ర - సింగరాయకొండ : కెనరా బ్యాంక్ వారోత్సవాల సందర్భంగా ఇంటింటికి బ్యాంక్ పదాలను ఇంటింటి ప్రచారంలో భాగంగా కెనరా బ్యాంక్ పథకాలు, ఖాతాదారులకు అందించే బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలంటూ కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ బరూరి నారసింహ మారుతి శశిధరరావు శనివారం పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంక్ రీజినల్ స్థాయిలో చేపట్టిన బ్యాంకు పథకాల ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని సింగరాయకొండ బ్రాంచ్‌లో ప్రారంభించామని, కెనరా బ్యాంక్ పథకాల ప్రచార కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. బ్యాంకు చేపడుతున్న కస్టమర్ సేవలు, కొత్త కొత్త పథకాలు గురించి వివరిస్తూ ఖాతాదారులు డిపాజిటర్లు, ప్రజలలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఇంటింటి ప్రచారం చేపట్టామన్నారు. విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, విద్యార్థులకు, జీరో అకౌంట్ తో సేవలు అందించేందుకు కెనరా బ్యాంక్ సిద్ధంగా ఉందన్నారు. ఖాతాదారులు కెనరా బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని శశిధర్ కోరారు. ఈ సందర్భంగా సింగరాయకొండ బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ గ్రామీణ, తీర ప్రాంతంలో కెనరా బ్యాంకు సేవలను ఖాతాదారులకు ప్రజలకు అందుబాటు లోకి తెచ్చిందని బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కోరారు. బ్యాంకు పథకాలు, సేవల గురించి ప్రజల లో అవగాహన కల్పిస్తూ కెనరా బ్యాంక్ సిబ్బంది పాకల రోడ్డులోని కెనరా బ్యాంక్ బ్రాంచ్ నుండి ట్రంక్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కలిగే విధంగా బ్యాంకు సేవలు అందించే పథకాల గురించి అవగాహన కల్పిస్తూ కరపత్రాలు తో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బందితో పాటు బ్యాంకు ఖాతా దారులు, రీజినల్ ఆఫీస్ వివిధ విభాగాల డిఎంలు శ్రీనివాస రావు, రాఘవేంద్ర రావు, రమేష్, తరుణ్ పాల్గొన్నారు.

జైలు ఆవరణలో "స్వచ్ఛ ఆంధ్ర"

విశాలాంధ్ర - ఒంగోలు : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్, ఆంధ్ర ప్రదేశ్ వారి ఆదేశాల మేరకు "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని జిల్లా జైలు, ఒంగోలులో నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడానికి స్పష్టంగా గుర్తించబడిన డబ్బాలను ఏర్పాటు చేయటం, జైలు ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించటం, జైలులోని ఖైదీలకు, సందర్శకులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే కార్యక్రమాలను చేశారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు "స్వచ్ఛ ఆంధ్ర" ర్యాలీ నిర్వహించి విజయవంతంగా అమలు చేశారు. ఈ కార్యక్రమం జిల్లా కారాగారం, ఒంగోలు పర్యావేక్షణాధికారి వరుణా రెడ్డి ఆధ్వర్యములో నోడల్ అధికారిగా జిల్లా సబ్ జైల్ల అధికారి, ఒంగోలు మహ మ్మద్ ఇర్ఫాన్, వైద్యాధికారి బ్రహ్మ తేజ, జైలరు శ్రీనివాసరావు, జిల్లా జైలు సిబ్బంది పాల్గొన్నారు.

రవిశంకర్‌ను కలిసిన జనసేన నాయకులు

విశాలాంధ్ర - ఒంగోలు : ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు రవి ప్రియ మాల్ అధినేత కంది రవిశంకర్‌ను దర్శి నియోజకవర్గం ఈదర గ్రామం జనసేన పార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొండారు వెంకటేష్, కొండారు రామాంజనేయులు, గనశాల శ్రీనివాసరావు, వెంకయ్య, మల్లికార్జున రావు, చిన్న శ్రీనివాసరావు, నరయ్య, లక్ష్మీ నారాయణ, ఆంజనేయులు, శివయ్య, రామారావు, కె.హనుమంతు రావు, వి. హనుమంతురావు, నాయుడు, పి.శ్రీనివాసరావు, బి. శ్రీనివాసరావు, బాలు, రామ బ్రహ్మం, అంకమ్మరావు, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయండి

విశాలాంధ్ర- వెలిగండ్ల : మండలంలోని గన్నవరం బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేయాలని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం మండలానికి విచ్చేసిన సందర్భంగా ఆయన గన్నవరం బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేదుకు గన్నవరం బ్రిడ్జి పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. అధికారులు దాదాపు 90 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తిచేయాలని ఆయన సూచించారు.

దళిత వైద్యునిపై విద్యుత్ ఏఈ వివక్ష తగదు

- వ్యవసాయ పొలానికి విద్యుత్ మీటర్ బిగించకుండా ఇబ్బందులు

విశాలాంధ్ర - వేటపాలెం : దళిత వైద్యుని వ్యవసాయ భూమికి విద్యుత్తు కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తు కాలయాపన చేస్తున్న విద్యుత్తు ఏఈ భాస్కర్ దళితుల పట్ల వివక్ష మానుకోవాలని బలహీన వర్గాల సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి శవనం సామ్యూల్ అన్నారు. శనివారం ప్రజాసంఘాల నాయకులు విద్యుత్తు ఏఈ నిర్లక్ష్య వైఖరి పట్ల మీడియాతో మాట్లాడారు. వేటపాలెం మండలం కొత్తపేట గ్రామం అక్కయ్యపాలెం పంచాయతీ సర్వేనెంబర్ 43-7లో చీరాల ప్రాంతానికి చెందిన ప్రముఖ దళిత వైద్యు నికి వ్యవసాయ భూమి ఉన్నదన్నారు.అయితే అందులో కొబ్బరి మొక్కలు,మామిడి మొక్కలు నాటి వ్యవసాయం చేస్తున్న తరుణంలో విద్యుత్ మీటరుకు నెల రోజులకుపైగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యుత్తు మీటర్ ఏర్పాటు చేయకుండా విద్యుత్తు ఏఈ భాస్కర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఇదేమటని ప్రశ్నిస్తే ఇష్టారీతిగా మాట్లాడుతూ తన పని తనకు తెలుసని మీ పని త్వరగా చేయాల్సిన అవసరం తనకు లేదంటూ దళిత వైద్యుని పట్ల వివక్ష చూపుతూన్నారని గతంలో ఆయన పై అనేక ఆరోపణలు కూడా ఉన్నాయని ఆరోపించారు.వైద్యులకే ఇలాంటి సంఘటనలు ఎదురైతే ఇక సామాన్య దళితుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు.తక్షణమే వ్యవసాయ భూమికి విద్యుత్ సదుపాయం కల్పించాలని లేకుంటే వివక్ష చూపి మీటర్ బిగించని కారణంగా అట్రాసిటీ కేసు పెట్టవలసి వస్తుందని హెచ్చరించారు. ఏఈ నిర్వాకంపై వైద్యుని సమస్యను జిల్లా కలెక్టర్, విద్యుత్ ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు నల్లబోతులరాజ్‌కుమార్, గోశాల అశోక్, మంచిగిల్ల పార్టీ ఆశీర్వాదం, దొడ్డ బ్రహ్మానందం, ఉమామహేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

M.V.O.P.NO 268/2019

IA NO 619/2023

పేర్ని లక్ష్మమ్మ వగైరా - పిటిషనర్లు

వర్సెస్

చిన్నారెడ్డి శివ వగైరా - రెస్పాండెంట్స్

ఆర్-3 తుమ్మల శ్రీను, తండ్రి సుబ్బారావు, ట్రాక్టర్ డ్రైవర్, శ్రీరామ్ కాలనీ, కర్నూల్ రోడ్, ఒంగోలు

పై నంబర్ నందు పిటిషనర్లు మిమ్ములను పార్టీగా చేర్పించమని కోరుచు పిటిషన్ దాఖలు చేయగా సదరు పిటిషన్‌యందు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తీసుకొనకుండా కాలయాపన చేయుచుండుట చేత మీకు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులు జారీ చేయించు లాగా కోర్టువారు ఉత్తర్వులు జారీ చేయించుచు ది. 04-03-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు పై తేదీన పైకోర్టు వారు ఎదుట ఉదయం గం. 10.30 ని॥ లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని మీ ఆక్షేపణలు తెలుపుకోవలసి ఉన్నది. లేని యెడల మీ పరోక్షము నందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

పెగడ శ్రీనివాసులు

న్యాయవాది, ఒంగోలు

విశాలాంధ్ర epaper.visalaandhra.com ఆదివారం 16 ఫిబ్రవరి 2025

పరిశ్రమల సర్వేను పూర్తి చేయాలి

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల సర్వేను 3 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో సూక్ష్మ మధ్యతరగతి పరిశ్రమల సర్వేను పూర్తి చేయడానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సూక్ష్మ,చిన్న,మధ్యతరగతి పరిశ్రమల సర్వేను డ్రై మోడ్‌లో చేపట్టాలని అధికారులకు సూచించారు. సర్వే జాబితాలో ఉన్న డూప్లికేట్ పేర్లను వేరుచేసిన జాబితాలను ఎంపీడీఓలకు ఇవ్వాలని ఆయన సూచించారు.జిల్లాలో సూక్ష్మ చిన్న మధ్యతరగతి పరిశ్రమల సర్వే చేపట్టడానికి సచివాలయ సిబ్బంది సహకారం తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాల మేరకు సర్వే పూర్తి చేయాలని ఆయన అధికారులకు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి బి.శ్రీనివాసరావు,గ్రామ సచివాలయం,వార్డు సచివాలయం ఇంచార్జ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ సురేంద్ర సస్పెండ్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ వివి సురేంద్ర విధులు పట్ల నిర్లక్ష్యంగా వహించినందుకు సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో జరుగుతున్న సూక్ష్మ చిన్న మధ్యతరగతి పరిశ్రమల సర్వేపై అధికారులను తప్పుదోవ పట్టించినందుకు ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ చెప్పారు.

రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా మున్సిపల్ అధికారులు ఆర్టీసీ బస్టాండ్, పెద్ద కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డు మార్జిన్‌కి ఇరువైపులా ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న ఆక్రమణలను ప్రోక్లైనర్ సహాయంతో టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు తొలగింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆయా షాపుల యజమానులకు టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో పెద్ద కూరగాయల మార్కెట్ వద్ద,ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టారు. సెల్లార్లలో వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేనియెడల టౌన్ ప్లానింగ్ అధికారులు యంత్రాల సహాయంతో తొలగిస్తారని అధికారులు నోటీసు ఉత్తర్వులలో పేర్కొన్నారు.

కుందేరు వాగు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : కుందేరు వాగు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లో కుందేరు వాగు ఆక్రమణలు తొలగించడానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ,డ్రైనేజ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుందేరువాగు బాపట్ల,చీరాల మండలాలలో ప్రవహిస్తుందన్నారు. కుందేరు వాగు కొన్ని చోట్ల 35 మీటర్లు మరి కొన్ని చోట్ల 75 మీటర్లు వెడల్పు ఉంటుందని ఆయన చెప్పారు. కుందేరు వాగు బాపట్ల,చీరాల మండలాల్లో మూడు గ్రామాలను కలుపుతూ వెళుతుందన్నారు.దీనికి సంబంధించి సమగ్ర సర్వే రిపోర్ట్‌ను రూపొందించాలని ఆయన సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. కుందేరు వాగు వెడల్పు చేయడానికి రెండువైపులా కాలువలు నిర్మించడానికి అవసరమైన డిపిఆర్ ప్రతిపాదనలను తయారు చేయాలని డ్రైనేజీ శాఖ ఇంజనీర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కుందేరు వాగులో ఉన్న చెట్లను వేలం నిర్వహించి తొలగించాలన్నారు. దాని ద్వారా వచ్చిన నిధు లను కాలువ మరమ్మత్తులకు ఖర్చు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు,డ్రైనేజ్ శాఖ ఇంజనీర్ సుబ్బారావు, బాపట్ల తహసిల్దార్ సలీమా, చీరాల తహసీల్దార్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొరిశపాడు రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : కొరిశపాడు రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. ఎర్రం చిన్నపోల్ రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు సంబంధించి శనివారం అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు 100శాతం పనులు పూర్తి అయినందున 1వ డివిజన్ ప్రధాన కార్యాలయంను ఒంగోలు నుండి బాపట్లకు తరలించుటకు సహేతిక కారణాలను తెలుపుతూ ప్రతిపాదన తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆయన ఆదేశించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ నుండి 1.33 టీఎంసీలతో బాపట్లలో 20వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఏర్పాటు చేయబడిన కొరిశపాడు రిజర్వాయర్ పనులను మ్యాప్ ద్వారా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీహరి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కొరిశపాడు రిజర్వాయర్‌లో మిగిలిన పనులను పూర్తి చేయుటకు కావలసిన భూమిని సేకరించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఏ స్థాయిలో ఉన్న పనులను అవార్డు స్థాయికి తీసుకురావాలన్నారు. పెద్దూరు,తూర్పుపాలెం ట్రక్కర్‌కు కావలసిన నిధులకు సంబంధించి ప్రతిపాదనలను తయారు చేయాలన్నారు. కొరిశపాడు రిజర్వాయర్‌కి సంబంధించి సర్వే వివ రాలపై ఆరా తీశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు కావలసిన రికార్డుల విషయం లో కొరిశపాడు తహసిల్దార్లను సహకరించాలని ఆయన ఆదేశించారు.పనులను కావాల్సిన నిధులకు సంబంధించి ప్రతి పాద నలను తయారు చేయుటకు చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయ జ్యోతిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్,చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, చీరాల వాటర్ రిసోర్స్ డిప్యూటీ ఇంజనీర్ సుజాత, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి అండగా ఉపాధ్యాయులు నిలవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - వేమూరు : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని, ఇటువంటి ప్రభుత్వానికి ఉపాధ్యాయులందరూ అండగా ఉండాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలపాటి రాజేంద్రప్రసాదను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయుల సమస్యలు అడిగేందు కోసం రోడ్డు ఎక్కిన కూడా పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు.అదేవిధంగా ఉపాధ్యాయులను వైన్ షాపుల దగ్గర కాపలా పెట్టిన పరిస్థితులు గమనించుకోవాలని గుర్తు చేశారు. యువనేత నారా లోకేష్ నేతృత్వంలో ఉపాధ్యాయుల సమస్యల కోసం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని ఆనందబాబు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిశీలకులు ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ అలపాటి నేతృత్వంలో పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో విద్య అందిస్తున్నారని గుర్తుచేశారు. అటువంటి వ్యక్తికి అండగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, కోగంటి శీనుబాబు, సురేంద్ర, పౌలు ప్రసాద్, రాందాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముళ్ల చెట్లు తొలగింపు

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ బాలవారిపాలెం గ్రామంకు వెళ్లే రహదారి మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ చెట్లు పెరిగి పోవడంతో వాహనదారులు,గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్,టీడీపీ నేత అనగాని శివప్రసాద్ ఆదేశాల మేరకు నిజాంపట్నం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో శనివారం జేసీబీని ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళ చెట్లను తొలగింపు చేసి శుభ్రం చేయించారు.ఈ సందర్భంగా సమస్య పరిష్కారం అవడంతో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్యకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సుబ్బయ్య వెంట ఎంపీటీసీ బాల మునలారెడ్డి, సర్పంచ్ నర్రా కృష్ణ, పందరబోయిన శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఉన్నారు.

కనిగిరిలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివాస్

విశాలాంధ్ర - కనిగిరి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేకంగా పాల్గొని, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పరిసరాలను స్వచ్ఛంగా చేయడంతో పాటు పరిసరాలలో ఉన్నచెత్త, చెట్లు, రాళ్లను స్వయంగా ఏరివేసి పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాలు గుంతలమయంగా ఉండడంతో గుంతలకు మట్టి తోలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల , జూనియర్ కళాశాల విద్యార్థులకు డస్ట్ బిన్స్ వాడకం, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత ప్రాముఖ్యత పై అవగాహన కల్పించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కరోనా వంటి మహ మ్మారులను ఎదుర్కోవాలంటే వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిస రాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని మనం ఎంత స్వచ్ఛ త పాటిస్తే మనకు అంత ఆరోగ్యం లభిస్తుందని, మనం ఎంత ఆరోగ్యంగా ఉంటామో దేశం కూడా అంతే సుభిక్షంగా ఉంటుందని ఆరోగ్యమనేది ప్రతి మనిషికి చాలా ముఖ్యం అని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మన మంతా ఆరోగ్యంగా ఉంటామని స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఒంగోలు : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలో ఎలాంటి నిర్లక్ష్యము ఉండరాదని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం శనివారం ప్రకాశం భవనములో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ పాల్గొని దివ్యాంగుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 60 మంది దివ్యాంగులు వారి సమస్యలపై అర్జీలను సమర్పించినట్లు చెప్పారు. సత్వరమే ఈ అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.